www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 నవంబర్ 2025
5
చిత్తూరు

వరసిద్ధుని వార్షిక పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం చివరి రోజు ఆలయంలోని కళ్యాణవేదికలో వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఉదయం నుంచి పూజ కార్యక్రమంలో భాగంగా అవభృథ యాగం, స్తండిల మండలేశ్వరపూజ, హోమం వ్రత సమర్పణ, మహాపవిత్ర సమర్పణ, మహా పూర్ణాహుతి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్, డీఈవో సాగర్ బాబు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ధనంజయ, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, బాలాజీ నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా వాటర్ ట్యాంక్‌లు

- విడతల వారీగా నీటి పరీక్ష
- నీటి సరఫరాపై కొరవడిన పర్యవేక్షణ
- మరమ్మతులకు నోచుకోని ట్యాంకులు
- కొన్ని కొత్తగా నిర్మించినా వినియోగంలోకి రాని దుస్థితి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ట్యాంకుల ఏర్పాటు, పైపులైన్ కనెక్షన్ అంటూ ట్యాంకుల నిర్మాణంలో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తోంది. ఇలా నిర్మించిన వాటర్ ట్యాంకులు వినియోగంలోకి రావడానికి ఆలసత్వం అవుతోంది. అలాగే గతంలో వినియోగంలో ఉన్న ట్యాంకులు ప్రస్తుతం వినియోగానికి నోచుకోక అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

నగరి నియోజకవర్గ వ్యాప్తంగా 183 ట్యాంకులు ఉండగా వాటిలో 20 ట్యాంకులు మరమ్మతులకు గురికాగా, 17 ట్యాంకులు వినియోగంలో లేవు. పలు ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్‌లు సక్రమంగా జరగడం లేదు. వర్షాకాలం కావడంతో నీటి పరిరక్షణలో తగు చర్యలు తీసుకోకుంటే ప్రజలు వ్యాధుల భారిన పడే ప్రమాదముందని సామాజికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నగరిలో తాగునీటి సరఫరాకు 18 ట్యాంకులు ఉండగా వాటిలో 11 మరమ్మతులకు గుర్తైనాయి, 7 ట్యాంకులు మాత్రమే వినియోగిస్తున్నారు. వినియోగించే ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచి క్లోరినేషన్ చేస్తున్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సత్ఫలితాలను అందిస్తుండటంతో ట్యాంకులు వినియోగంలో లేని ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తరచూ మోటర్లు రిపేరు అవుతుండటం, జాతీయ రహదారి పనుల్లో భాగంగా పైపులు పగలడం కారణాలతో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాలో సమస్యలున్నాయి.

ఇక్కడ భూమిలో డైయింగ్ రసాయనాలు ఇంకడంతో బోర్లలో వచ్చేనీరు తాగడానికి వీలుపడదు. దీంతో అందరూ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే నీటిపైనే ఆధారపడుతారు. నగరి మున్సిపాలిటీలో రెండు నెలలక్రితం వాటర్ టెస్టింగ్ చేశారు. ఇక్కడ నీటిపై ప్రజలకు పలు సందేహాలు ఉన్న నేపథ్యంలో అధికారులు వాటర్ టెస్టింగ్ రిపోర్టును గోప్యంగానే ఉంచుతున్నారు. బోర్లలో వచ్చే నీటిలో పలు రసాయనాలు కలిసి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పుత్తూరు మండలంలో 32 వాటర్ ట్యాంకులు ఉండగా వాటిలో 32 ట్యాంకులు వినియోగంలో ఉన్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించినా అది వినియోగంలో లేదు. వర్షపు నీరు మాత్రమే ఈ ట్యాంకులో చేరుతోంది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అందుబాటులో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 15 నుంచి నెలరోజుల వ్యవధిలో ట్యాంకులు శుభ్రపరుస్తున్నారు. వాటర్ టెస్టింగ్‌లు నిత్యం జరగడం లేదు.

నింద్ర మండలంలో 40 వాటర్ ట్యాంకులు ఉండగా వాటిలో 15 మరమ్మతులకు గురికాగా వాటిని శుభ్రపరచడం లేదు. ట్యాంకులున్న ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నింద్ర ధర్మరాజ గుడి వద్ద గల ట్యాంకు నిర్మాణం పూర్తి అయ్యి 4 యేళ్లు అవుతున్నా ఇంకా పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వలేదు.

విజయపురం మండలంలో 32 వాటర్ ట్యాంకులు ఉండగా వాటిలో 11 మరమ్మతులకు గురికాగా వాటిని శుభ్రపరచడం లేదు. ట్యాంకులున్న ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వినియోగంలో ఉన్న ట్యాంకులు నెలకు ఒకసారి క్లోరినేషన్ చేస్తున్నారు. నగరి పట్టణంలోని వాటర్ టెస్టింగ్ సెంటర్లో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు సంబందిత వాటర్ టెస్టింగ్ చేస్తున్నారు. రొటేషన్ పద్ధతిలో టెస్టింగ్ చేస్తూ వస్తున్నారు. కాళికాపురం వద్ద ట్యాంకు నిర్మించినా వినియోగంలోకి రాలేదు. వాటర్ ట్యాంకుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయడం లేదు.

వడమాలపేట మండలంలో 61 వాటర్ ట్యాంకులు ఉండగా వాటిలో 7 మరమ్మతులకు గుర్తైనాయి. అయినా ఎక్కువ గ్రామాలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితిలో వాటినే వాడుకుంటున్నారు. వినియోగంలో ఉన్న ట్యాంకులు నెలకు ఒకసారి క్లోరినేషన్ చేస్తున్నారు. ఒక్కొసారి కొన్ని కొన్ని ట్యాంకుల చొప్పున నీటి టెస్టింగ్‌లు చేస్తున్నారు.

నగరి పీసీఎన్ జడ్పీహెచ్‌ఎస్ మైదానంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు, నింద్ర ధర్మరాజ గుడి వద్ద పైపులు బిగించని వాటర్ ట్యాంకు , దళితవాడలో మరమ్మతులకు నోచుకోని ట్యాంకు

వర్షాల ఎఫెక్ట్..
భారీగా పెరిగిన కూరగాయల ధరలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

గత రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా కురిసిన ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కూరగాయల ధరాలు అమాతంగా ఆకాశాన్ని అంటుతున్నాయి. వరుస వర్షాలతో జిల్లా లోని చాలా మేర ఆకుకూరలు, కూరగాయల పంటల్లో నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. రైతు బజార్‌లోనే కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇక బయట మార్కెట్‌లో ధరలు విషయం చెప్పాల్సిన పనిలేదు. సెప్టెంబర్ నెలతో పోల్చితే అన్ని రకాల కూరగాయల రెండింతలు పెరిగాయి. ఉల్లి, వెల్లులి మినహాయిస్తే అన్ని రకాల కూరగాయలు ఒక్కసారిగా పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతోంది.

చిత్తూరు జిల్లాలో అక్టోబర్ నెలలో ఎడతెరిపి లేని వర్షాలు కురిస్తాయి. జిల్లాలో కూరగాయ పంట సాగు పూర్తిగా దెబ్బతింది. కుప్పం, వీకోట, పలమనేరు మండలాల్లో కూరగాయ సాగు అధికంగా ఉంటుంది.. కూరగాయల అధికంగా పండించే మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కోవడం పొలాల్లో నీరు నిలిచి పంట పాడైపోవడంతో ఆప్రాంతాల్లో పూర్తిగా ఉద్యానపంటను దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కార్తీక మాసం కావడంతో కూరగాయలు, ఆకుకూరల ధరల అమాతంగా పెరిగిన్నట్లు మార్కెట్ శాఖ అంచనా వేస్తోంది. రైతు బజార్‌లో ఏ కూరగాయ తీసుకున్నా కిలో రూ.40 నుంచి 50లు పెట్టాల్సి వస్తోంది.

50 శాతం తగ్గిన దిగుబడి..

చిత్తూరు జిల్లా కేంద్రంలోని ప్రధాన మున్సిపల్ కూరగాలయ మార్కెట్‌లకు తమిళనాడు రాష్ట్రం వేలూరు, కర్నాటక నుండీ కూరగాయలు పూలు, పండ్లు దిగుమతి అవుతుంటాయి. ప్రధానంగా తమిళనాడు, వేలూరు నుండీ క్యారెట్, బీట్‌రూట్ చిత్తూరు మార్కెట్‌కు ఎక్కువగా తెస్తుంటారు. పలమనేరు, కుప్పం ప్రాంతాల నుండీ టమోట, బీన్సు, బీరకాయ, సొరకాయ, ముల్లింగితో పాటు సీజన్‌తో ప్రమేయం లేకుండా అనప, అలసంద, చిక్కుళ్లు వస్తుంటాయి. మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలల్లో కూడా వర్షాల కారణంగా ఉద్యానవన పంటలు దెబ్బతినడంతో చిత్తూరు కూరగాయల మార్కెట్‌లో నవంబర్ మొదటి వారం నుండీ కూరగాయల ధరలు పెరిగాయి. ధరలు తగ్గుముఖం పట్టాలంటే డిసెంబర్ చివరివారం, జనవరి వరకు వేచిచూడాల్సిందే..

నెల రోజుల్లోనే కూరగాయల ధరల్లో తేడా..

కిల్లోలో	సెప్టెంబర్	నవంబర్
వంకాయ	రూ.40	రూ.80
బెండ	రూ.20	రూ.60
కాకర	రూ.50	రూ.80
క్యాబేజీ	రూ.40	రూ.60
బీరకాయ	రూ.30	రూ.50
దొండకాయ	రూ.40	రూ.60
క్యారెట్	రూ.40	రూ.70
చిక్కుడు	రూ.60	రూ.80
టమోట	రూ.20	రూ.40
ఆకుకూర కట్ట	రూ.10	రూ. 20-25

పేదలకు ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

10,168 గృహ నిర్మాణాలు పూర్తి : ఎంపి

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలో మూడు లక్షల గృహాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయచోటి నుండి సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించారని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు నగరపాలకసంస్థ పరిధిలోని తిమ్మసముద్రంలో గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు ఎంపి హాజరు కాగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్ మోహన్, చూడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎంఎల్‌సి రాజసింహులు, హౌసింగ్ పిడి ఎన్.సుబ్రమణ్యం, ఈఈ శంకరప్ప, ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు ఇల్లు లేని పేద వారికి ఇల్లు మంజూరు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వ భూములను చాలా కాలం తమ అనుభవంలో కలిగిన వారికి అనుభవపత్రం మంజూరు చేయాలని, తద్వారా ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగలరన్నారు. ఇంటి స్థలం లేని వారికి గ్రామ కంఠం, ప్రభుత్వ పోరంబోకు స్థలంలో అనుభవపత్రాలను మంజూరు చేసేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల కొరకు నవంబర్ 30 వరకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ప్రాధాన్యతా క్రమంలో లబ్ధిదారులను గుర్తించి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎంఎవై 1.0 కింద ఇప్పటి వరకు పూర్తి అయిన 10,168 గృహాలకు గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఇంకా ఇల్లు లేని వారిని పిఎంఎవై 2.0 ద్వారా గుర్తించి 2,472 గృహాలు మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో హౌసింగ్‌శాఖ ద్వారా ఇల్లు లేని అర్హులను గుర్తించి దరఖాస్తులు చేయించే కార్యక్రమం చేస్తామన్నారు. ఇళ్ల మంజూరు కొరకు గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పిఎంఎవై ద్వారా అందే ఆర్థిక సహాయంతో సిమెంట్, స్టీల్, ఇటుక వంటివి సమకూర్చుకోగలరని, ఇంటి నిర్మాణాలకు బిసి, ఎస్సిలకు రూ.50 వేలు, ఎస్టిలకు రూ.75వేలు అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా అదనంగా రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.



పూతలపట్టులో..

పూతలపట్టు: బుధవారం మండలంలోని మన్నారుపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు లక్షల ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందజేశారు. అనంతరం వేనూతనపల్లి గ్రామంలో రూ.11లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ మారు నూతన గృహాలకు ప్రభుత్వం రూ.4లక్షల వరకు చెల్లించనిందని ఆయన తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. మండల కన్వీనర్ దొరబాబు, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని కెంచనబల్ల గ్రామంలో సామూహిక గృహప్రవేశం బుధవారం నేతలతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారాలతో ఇంటి నిర్మాణానికి 2.5 లక్షలు అందిస్తుందన్నారు. ఇల్లు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కౌలేష్, ఎంపిడిఓ లక్ష్మీకాంత్, ఎస్సై వెంకట మోహన్, టిడిపి రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ రాజు, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ పాల్గొన్నారు.



రామకుప్పంలో..

గంగాధర నెల్లూరు: పేదలకు సొంత ఇల్లు నిర్మించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉందని పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ తెలిపారు. మండలంలోని వరత్తూరు పంచాయతీ బోడపురు గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 గృహప్రవేశాలు, ఇంటి తాళాలు అప్పగింత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన ఇల్లు లబ్ధిదారులు బేబీరాణికి ఇంటి తాళాలు అప్పగించారు. సింగల్ విండో అధ్యక్షులు మోహన్ నాయుడు, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి దేవ సుందరం, సింగల్ విండో మెంబర్ జ్యోతి యాదవ్, సర్పంచ్ రఘునాథ నాయుడు, పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అరుల్ నాదన్, హౌసింగ్ డీఈ శ్రీధర్ రాజు, హౌసింగ్ ఇంచార్జ్ ఏ ఈ చంద్రశేఖర్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు గీత, నరేష్, బాబు ప్రేమ్ పాల్గొన్నారు.

రొంపిచర్ల: పట్టణంలో లబ్ధిదారులకు ఇచ్చిన పిఎంఎవై ఇళ్లు గృహప్రవేశ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, రవి నాయుడు, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, ఇమ్రాన్ ఖాన్, ఓబులేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చెర్మెన్ రఘునాథరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు శివారెడ్డి పాల్గొన్నారు.

శ్యామలా దేవికి అశ్రునివాళి

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: పేద విద్యార్థులకు విద్య కోసం కనీస అవసరాల కోసం కృషి చేసిన ఉపాధ్యాయురాలిగా అత్యుత్తమ సేవలు అందించిన శ్యామలాదేవి మంగళవారం సాయంత్రం మృతిచెందారు. బుధవారం మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి దంపతులు, పలు ఉపాధ్యాయ బృందాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు భారీగా శ్యామల దేవి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గంగమ్మ గుడి వద్ద చిత్తూరు- పుత్తూరు రోడ్డుపై శ్యామలాదేవి చిత్రపటంతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. శ్యామల దేవి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్యే నానాజీ

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని బుధవారం కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. వారి వెంట టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు ఉన్నారు.

వేగంగా రోడ్డు పనులు పూర్తి చేయండి

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో కోకావాండ్లఊరు వెళ్లె రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ పి.నరసింహప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. గ్రామస్తులు వినతి మేరకు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్ ఇటీవల రోడ్డును పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. చిత్తూరు - తిరుపతి ప్రధాన రహదారి నుండి కోకావాండ్ల ఊరు వరకు 1.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మట్టి పనులు పూర్తిచేసి గ్రావెల్ వర్క్ ప్రారంభించనున్నారు. ఈ పనులను కమిషనర్ తనిఖీ చేసి, పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, డీఈ రమణ ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ

ప్రజాశక్తి- సోమల: సోమల మండల విద్యాశాఖ అధికారి విజయకుమారి మండలంలో పాఠశాలలను తనిఖీ చేశారు. చింపి రెడ్డిపల్లి, టిఎం గొల్లపల్లి, అన్నెమ్మగారిపల్లి ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ నిర్వహించి ఎస్ఏ పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారో చూసి విద్యార్థులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మరింత రుచికరంగా విద్యార్థులకు వండి పెట్టాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జిసికె ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలి

జిల్లాలో వైసిపి ర్యాలీలు, వినతులు



పుంగనూరులో..

ప్రజాశక్తి- పుంగనూరు: మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణలు వెంటనే ఆపాలని మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ బస్టాండ్‌లో వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కుట్రపన్ని లక్షల, కోట్లు విలువచేసే మెడికల్ కాలేజీల భూముల్ని తక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. 50 ఎకరాల మెడికల్ కాలేజీల భూముల వల్ల రాష్టానికి లక్షల, కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహిస్తే పేద విద్యార్థులు డాక్టర్లు అవ్వడానికి అవకాశం ఉంటుందని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల దాదాపు 2150 సీట్లు కోల్పోతున్నామని తెలిపారు. పులివెందులలో 50సీట్ల మెడికల్ కాలేజ్ పూర్తయినా చంద్రబాబు నాయుడు అడ్డుకుని నేషనల్ కౌన్సిల్కు లేఖ రాశాడని ఆరోపించారు. చిన్న దేశమైన క్యూబా కరోనా సమయంలో ప్రపంచానికే వైద్యపరంగా సేవలందించిందని, దాదాపు 60 రాష్ట్రాల్లో ఉచిత సేవలు అందించారని అని గుర్తు చేశారు. క్యూబా దేశంలో డాక్టర్లకు ఉచితంగా సీట్లు ఇవ్వడంతో ప్రపంచవ్యాప్తంగా వారు సేవలందించారు. మెడికల్ కళాశాల ప్రైవేటుపరం చేయడం వెంటనే ఆపాలని లేకపోతే మరింత ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ వాసు, మాజీ ఎంపీ రెడ్డప్ప, శ్రీనాథ్ రెడ్డి, అనిషారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, వెంకట్ రెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: 17 మెడికల్ కాలేజీలను బినామీలకు కట్టబెట్టే ప్రయత్నాన్ని ఖండిస్తూ చిత్తూరు వైసిపి ఇంచార్జ్ విజయానందరెడ్డి నేతృత్వంలో గంగినేని చెరువు వద్ద నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం నిర్ణయానికి స్వస్తి పలికి ప్రభుత్వం నిర్మించకుంటే వైసిపి నేతృత్వంలో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

జీడీ నెల్లూరులో..

పలమనేరు: మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి నాయకులు సిల్క్‌ఫార్మ్ నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఓ వినతిపత్రం అందజేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూతలపట్టు: కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని వైసిపి పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జాతీయ రహదారి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు లలిత కుమారి, కుమారరాజా, బాబు రెడ్డి, రాజారత్నం రెడ్డి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: చంద్రబాబు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్న నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో బుధవారం భారీ ర్యాలీతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపా లక్ష్మీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు మండల కేంద్రానికి చేరుకుని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద నుండి చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వచ్చి డిప్యూటీ తహసిల్దార్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురవారెడ్డి, ఎంపీపీ అనిత పాల్గొన్నారు.

చిత్తూరులో..

పూతలపట్టులో..

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలమనేర్ అర్బన్ ఎస్ఐ మురళీమోహన్, ఉమెన్ ఎస్సై స్వర్ణ తేజ పాల్గొని పోక్సో చట్టం, బాల్య వివాహాలు, వాటి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు దురఅలవాట్లకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో చదవాలని సూచించారు.

ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆరోగ్యం- స్వాభిమానం- మహిళా సాధికారత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లు లోనుకాకుండా సనాద్రర్శంలో పయనించాలి సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాగా చదివి వారికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నంటీశ్వరయ్య, ఇ.క్యూ.ఏ.సి కోరార్డినేటర్ డాక్టర్ బెనజివ్, ఉమెన్సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ శశికళ, డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.

మూడు చక్రాల
మోటార్ సైకిళ్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఎంఎస్ నెం.10 ప్రకారం జిల్లాలోని శారీరక విభిన్న ప్రతిభావంతులకు నియోజకవర్గానికి 10 చొప్పున మోటారు మూడు చక్రాల వాహనాలు మంజూరు చేయనున్నట్లు నగరి నియోజకవర్గ దివ్యాంగ జేసీ అధ్యక్షులు కేశవన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. ఏపీడీఎఎస్‌సీఏపీ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 25లోపు సమర్పించాలన్నారు. ఈ ఏడాది నవంబరు 25 నాటికి 18 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, సదరం ధృవీకరణ పత్రం ప్రకారం కాళ్లలో 70శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉండి, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉన్నవారు అర్హులన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అభ్యర్థి ప్రభుత్వం నుండి గానీ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా గానీ గతంలో మోటరైజ్డ్ వాహనం పొందివుంటే అనర్హులౌతారన్నారు. అభ్యర్థి పేరు మీద ఏ మోటరైజ్డ్ వాహనం ఉండకూడదన్నారు. సహాయక పరికరాలు వాడకుండానే నడవగల వ్యక్తులు అనర్హులన్నారు. వేతనం పొందుతూ కనీసం ఒక సంవత్సర అనుభవం ఉన్నవారు సంబంధిత ధృవీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందన్నారు. దళారులను, మధ్యవర్తులను నమ్మక దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో..
అకడమిక్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

స్వయం ప్రతిపత్తి పొందిన అనంతరం నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండవ అకడమిక్ కౌన్సిల్ సమావేశం ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో గత ఏడాది సాధించిన విజయాలను, పాటిస్తున్న ప్రమాణాలను, అకడమిక్, పరిశోధన, పరిపాలనా రంగాలలో కళాశాల విధానాలను వివరించారు. అకడమిక్ కౌన్సిల్ సభ్యులుగా యూనివర్సిటీ చేత నియమించబడిన సభ్యులు వాణిజ్యశాస్త్రం ప్రొఫెసర్, కామర్స్, మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలలో విద్యాప్రమాణాలు మెరుగుపడటానికి విద్యార్థులలో సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగుపరచాలని సూచించారు. మరోసభ్యులు సివిల్ సర్జన్, రెసిడెన్స్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ మంజుల మాట్లాడుతూ నగరంలోని ఇతర విభాగాల ప్రముఖుల ద్వారా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అకడమిక్ కౌన్సిల్ మెంబర్ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర రాజు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉన్నత విద్యలో వచ్చిన మార్పులను తెలియజేశారు. ఇతర సభ్యులు డాక్టర్ రవి వర్మ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ గుణశేఖర్ పరిశోధన, పరిపాలన అంశాలపై చర్చించి కళాశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ డాక్టర్ వేణుగోపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరి పాల్గొన్నారు.

అప్రతిష్టపాలు చేసింది వైసిపినే..!

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- రామకుప్పం: కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని వైసిపి పాలకులు కల్తీ నెయ్యితో అప్రతిష్ట పాలు చేశారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022 సంవత్సరంలో వైసిపి నేత వైవి.సుబ్బారెడ్డి టీటీడీ బోర్డు చైర్మన్ హయాంలో ప్రీమియర్ అగ్రి ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీ లిమిటెడ్, బోలె బాబాలు డెయిరీలు సరఫరా చేసిన నెయ్యి నుంచి నమూనాలను వెజిటేబుల్ ఆయిల్ కల్తీ జరిగిందన్నారు. 68.17లక్షల కిలోల కల్తీ నెయ్యితో తిరుమలలో ప్రసాదాన్ని అపవిత్రం చేసి, పారదర్శకంగా ఉన్నామని సిగ్గులేకుండా చెప్పుకున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించి స్వామి లడ్డు కల్తీ వ్యవహారంలో సుప్రీంకోర్టు చేసిన సిట్ కల్తీ గాళ్ళను అరెస్ట్ చేస్తుంటే పెద్ద కల్తీ గాళ్లకు వణుకు పుట్టిందన్నారు. సిట్ అధికారుల దూకుడుతో కల్తీ నెయ్యి వ్యవహారంలో వైసీపీలో భయం పట్టుకుందని, కల్తీ నెయ్యి వ్యవహారంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి శిక్ష పడుతుందని తెలిపారు.

ట్రైనీ ఐసిఆర్‌పిలకు అవగాహన

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని టీ.పుత్తూరు గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్త రోజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎం మోడల్‌ను, పండ్ల తోటలో ఏర్పాటు చేసిన ఎ గ్రేడ్ మోడల్ (30 రకాల పండ్ల మొక్కలు)ను చూపించి ట్రైనింగ్ ఐసీఆర్‌పిలకు వివరించారు. అనంతరం బంగారుపాళ్యం మండలం కల్లూరుపల్లె గ్రామంలో ఇన్‌పుట్స్ తయారీపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన పెల్లటైజేషన్, నీమాస్త్రం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానాలను ప్రదర్శనగా చూపించి ట్రైనీలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రైతులు సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేలసారాన్ని పెంపొందించి స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.వాసు, మండల వ్యవసాయ అధికారి జి.ప్రవీణ్, విహెచ్ఏ తేజశ్రీ, ఎస్‌పిఎంయూ నుండి నరేంద్ర, ఎన్ఎఫ్ఏలు ఫైజున్నిసా, మహేష్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత కోసమే జాబ్ మేళా

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ప్రాంత నిరుద్యోగ యువత కోసమే జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో రాండ్ స్టాండ్ ఆపరేషనల్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో కుప్పం ప్రాంతంలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని ఇదే క్రమంలో జాబ్ మేళాలు సైతం నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, జనసేన నేత నరేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సతీష్, సుగుణమ్మ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 'అక్షయ'

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని అక్షయ ఈనెల 5న జరిగిన కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ ఆన్లైన్ క్విజ్ పోటీలలో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని అక్షయ జిల్లా స్థాయికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన మంచి విద్యాబోధన అందిస్తే ఉన్నతస్థాయిలో కౌశల్ వంటి ప్రతిభా పరీక్షల్లో రాణించగలరని తెలియజేశారు. ఉపాధ్యాయులు బాలాజీ, చంద్రశేఖర్, బాబు, పద్మశ్రీ, సరోజమ్మ, సత్య, జానకీ దేవి, లోకనాథం, అరుణకుమారి, ప్రసన్నకుమారి, మహేష్ అక్షయను అభినందించారు.

చేపల చెరువుల వేలంపాట

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలం నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని 26 చెరువులకు బుధవారం స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లిపట్ల సచివాలయంలో చేపల చెరువు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.4,25,000 ఆదాయం వచిచందని ఎంపిడివో తెలిపారు. డిప్యూటీ ఎంపీ నాగార్జున రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైస్ ఎంపీపీ రూపా జైకుమార్, సర్పంచ్ చిన్నా బుడ్డమ్మ సాంబయ్య, రమేష్ రెడ్డి, జగదీష్ రెడ్డి, గోపాల్ నాయుడు, ఉపేంద్ర, మునస్వామి పాల్గొన్నారు. అలాగే మండలంలోని ధర్మపురి పంచాయతీ మండలంలోని ధర్మపురి పంచాయతీ పరిధిలో ఉన్న ఏడు చెరువులకు బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.2,59,500లు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో తెలియజేశారు.

గ్రామయోజన పనుల తనిఖీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని కడపగుంట గ్రామపంచాయతీ కడపగుంట హరిజనవాడలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా మంజూరైన పనులను జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఈ సందర్భంగా మంజూరైన డ్రైనేజ్ పనులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఏవో లోకేష్, అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, వీఆర్వో హరిప్రసాద్ రెడ్డి, ఎక్స్ సర్పంచ్ షణ్మగం, టిడిపి నేత ఆర్ముగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వెదురు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- రామకుప్పం: బ్యాంబో సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గడ్డూరు వద్ద బుధవారం రైతులకు ఉచితంగా వెదురు మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల గట్ల వద్ద వెదురు మొక్కలు పెంచడం వలన కలిగే లాభాలు, భవిష్యత్తులో వెదురు బొంగుల ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, రెస్కో డైరెక్టర్ పి.సతీష్, క్లస్టర్ ఇంచార్జ్ రవిరెడ్డి, ఏపీఎం శ్రీనివాస మూర్తి, ఏపీవో గణేష్ పాల్గొన్నారు.

ఎస్వీబీసీలో నాణ్యమైన ప్రసారాలు అందించాలి

ప్రజాశక్తి తిరుపతి సిటీ

శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు మరింత నాణ్యంగా ప్రసారాలు అందించేందుకు, ఉద్యోగులు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించేందుకు, పాలన పారదర్శకంగా ఉండేలా, వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో జరిగిన ఎస్వీబీసీ బోర్డు మీటింగ్ లో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీలోని మానవ వనరులు, ఆర్థిక వ్యవహారాలు, ఉత్పత్తి, సరఫరా, నిల్వలు తదితర విభాగాల అంశాలను ఒకే సమగ్ర సాఫ్ట్ వేర్ వ్యవస్థలో సమన్వయం చేసేందుకు సంస్థ వనరుల సమగ్ర ప్రణాళికా వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఎస్వీబీసీ ఇంఛార్జి సీఈవో డి. ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఏ అండ్ సీఏవో ఓ బాలాజీ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత సర్దార్ వల్లభాయ్ పటేల్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, భారతదేశ మొదటి ఉప ప్రధానమంత్రి, హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ నవభారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించి , ప్రపంచానికే స్ఫూర్తిప్రదాతగా నిలిచారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతోత్సవాలను బుధవారం చిత్తూరులోని గాంధీ విగ్రహం కూడలి వద్ద నిర్వహించిన ఏక్తాదివస్ కార్యక్రమానికి ఎంపి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అలాగే జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నగర మేయర్ కుమారి అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు. మొదట సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని చేతపట్టి ఏక్తాదివస్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ర్యాలీ నగర పురవీధుల గుండా సాగింది. టీడీపీ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి- పుంగనూరు

ప్రస్తుత సమాజంలో భయభ్రాంతులకు గురిచేస్తున్న కేన్సర్ వ్యాధి ముందస్తుగా తెలుసుకోవడానికి ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించమని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నానబాల గణేష్, సిఎస్ రాజారెడ్డి అన్నారు. స్థానిక బిఎంఎస్ క్లబ్ ఆవరణంలో రోటరీ క్లబ్, మా నవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా తిరుపతి స్విమ్స్ వైద్య బృందం ద్వారా ఉచితంగా కేన్సర్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. పుంగనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వంశీకృష్ణ రిబ్బన్ కట్ చేసి పింక్ బస్ శిబిరాన్ని ప్రారంభించి జ్యోతిప్రజ్వలన చేశారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి కేన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము కేన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు 150 మంది విచ్చేసి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. మానవతసంస్థ అధ్యక్షుడు ఎసి.నారాయణరెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రభాకర్, స్విమ్స్ మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ ఎవి.చైతన్యభాను, ప్రజా సంబంధాల అధికారి డి.చంద్రమోహన్, రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ శరణ్ కుమార్, డాక్టర్ విజయకుమారి, పూలత్యాగరాజు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

17 నుంచి కుష్టు వ్యాధి సర్వే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 17వ తేదీ నుండి నవంబర్ 30వ తేదీ వరకు ఇంటింటా కుష్టు వ్యాధి సర్వే చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని పారామెడికల్ సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని డిఎం అండ్ హెచ్‌ఓ ప్రారంభించారు. జిల్లాలోని వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చర్మం మీద స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి, వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యాధికారి దగ్గర పరీక్ష చేయించి వాటికి సంబంధించిన చికిత్సను అందించాలన్నారు. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని ఈ వ్యాధి చికిత్స, కారణాలు, నివారణ చర్యలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ మచ్చలను అశ్రద్ధ చేయకుండా శరీరంలో పూర్తిగా పరీక్ష చేయాలన్నారు. ఇందుకోసమే ఆడవాళ్లను ఆశ వర్కర్లు మగవాళ్ళను మేల్ వాలంటీర్లు పరీక్ష చేస్తారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

అక్రమ కట్టడాలపై చర్యలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు నిర్మాణాలను కూల్చి వేయడం జరగుతుందని మున్సిపల్ కమీషనర్ ఎన్వి.రమణారెడ్డి హెచ్చరించారు. బుధవారం పలమనేరు పట్టణ పరిధిలోని గడ్డూరు రోడ్డు, బొమ్మిదొడ్డి తదితర ప్రాంతాలలో జరుగుతున్న అనధికార కట్టడాలు, లేఔట్లు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో గుర్తించి వాటిని తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల జరుగుతున్న అనధికార కట్టడాలపై దృష్టి సారించామన్నారు. చట్ట విరుద్ధమైన నిర్మాణాలు చేపట్టినట్లు అయితే తగినచర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తుగా నిభందనలకు లోబడి అనుమతి తీసుకోవాలని కోరారు. నిభందనలు పాటించని ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. పట్టణంలో అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించే కార్యక్రమం కొనసాగిస్తామని, రోజువారీ తనిఖీలు ఉంటాయని తెలిపారు. టిపిఓ ఇందిర, టౌన్ ప్లాంగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో కుప్పం సస్యశ్యామలం

ప్రజాశక్తి- కుప్పం: సీఎం చంద్రబాబు భగీరథ ప్రయత్నంతో కృష్ణా జలాలను కుప్పంకు తీసుకువచ్చి కుప్పం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ డికెపల్లి చెరువును బుధవారం ఎమ్మెల్సీ శ్రీకాంత్ పరిశీలించారు. హంద్రీనీవా నీటితో డికెపల్లి చెరువు మరో రెండు, మూడు రోజుల్లో నిండి మొరవ పోనుందని తెలిపారు. కుప్పం పట్టణానికి తాగునీరు అందించే డీకేపల్లి చెరువు కృష్ణా జలాలతో నిండి మొరవ పోనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేతుల మీదుగా జలహారతి కార్యక్రమాన్ని చేపట్టేందుకు టిడిపి నేతలు సన్నహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎమ్మెల్సీ శ్రీకాంత్ టిడిపి నేతలతో కలిసి డీకేపల్లి చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోముశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్ శివ, బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగల్, డాక్టర్ వెంకటేష్, మణి, నాను పాల్గొన్నారు.

డ్యూటీ సమయంలో నిర్బంధంపై సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 'డ్యూటీ సమయంలో సెల్‌ఫోన్లను కార్మికుల నుంచి తీసుకోవడం ఏంటి' అని సిఐటియు నాయకులు మండిపడ్డారు. తిరుమలలో వకుళమాత గెస్ట్‌హౌస్, నందకం, సూరప్పతోట, అష్ట వినాయక, పాంచజన్యం, కౌస్తుభం, రాంబగీచ గెస్ట్‌హౌస్‌ల్లో డ్యూటీ సమయంలో కార్మికుల వద్ద సెల్‌ఫోన్లు తీసుకోవడం అన్యాయమని, ఫోన్లు తీసుకోకుండా టిటిడి తగు చర్యలు తీసుకోవాలని ఎఫ్ఎంఎస్ కార్మికులు టిటిడి పరిపాలనా భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి. సుబ్రమణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్ర మాట్లాడుతూ డ్యూటీ సమయంలో కార్మికుల నుండి సెల్ ఫోన్లు తీసుకోవడం సరైనది కాదని అన్నారు. డ్యూటీలో కార్మికులను దొంగల్లా చూస్తున్నారని, అవమానపరుస్తున్నారని, వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎంఎస్ కార్మికులకు టీటీడీ ఇచ్చే గౌరవం ఇదేనా ప్రశ్నించారు. కొంతమంది అధికారులు తమ జాగీరు లాగా వ్యవహరిస్తున్నారని, కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడ లేని నిబంధనలు పెట్టి కార్మికులను భయోందోలనకు గురిచేయడాన్ని తప్పుపట్టారు. టీటీడీ యాజమాన్యం వెంటనే స్పందించి డ్యూటీలో సెల్ ఫోన్లు తీసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరంతరం భక్తులకు సేవ చేస్తున్న ఎఫ్ఎంఎస్ కార్మికులకు వైకుంఠ ఏకాదశి శ్రీవారి దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తిరుపతి జేఈవోకు, ఈవోకు సమర్పించారు. నాయకులు ఎన్. మాధవ్ కృష్ణ, పి .బుజ్జి, ఆర్ లక్ష్మి, కే వేణుగోపాల్, టిటిడి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. సిద్దయ్య, వి. ప్రభాకర్, టిటిడి కాంట్రాక్ట్ సూపర్వైజర్స్ అండ్ టెక్నీషియన్స్ యూనియన్ ప్రెసిడెంట్ డి. పార్థసారధిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్. ఏకాంబరం పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎస్వీయూ వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్: 'ఫిజికల్ కెమిస్ట్రీ చదువుకున్న వారికి పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇకపై పాలనాపరమైన బాధ్యతల తరువాత ఏ చిన్న అవకాశం దొరికినా, పాఠాలు బోధించడానికి మళ్లీ ఫిజిక్స్ విభాగానికి వస్తా' అని ఎస్వీయూ వీసీ తాతా నరసింహారావు అన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన భౌతికశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. అర్ధగంటపాటు ఎంఎస్‌సి ఫిజిక్స్ విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఫిజిక్స్ విద్యార్థుల కోసం సమయం వెచ్చించిన వీసీ నరసింహారావుకు విభాగాధిపతి ఆచార్య దేవప్రసాదరాజు కృతజ్ఞతలు తెలిపారు. గొప్ప పరిశోధకుడిగా ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల్లో, పరిశోధనా కేంద్రాల్లో పనిచేసిన అనుభవాన్ని ఫిజిక్స్ విద్యార్థులకు అందించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

9 మంది పేకాట రాయుళ్ళు అరెస్టు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం మల్లానూరులోని ఓ ఇంటి వద్ద పేకాట ఆడుతున్న 9 మందిని కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్లనూరు పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. 9 మంది పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.25600లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

గ్రీన్ కుప్పంపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మున్సిపాలిటీని రాబోయే రోజుల్లో చెత్త లేకుండా చేసి పొల్యూషన్ కంట్రోల్ చేస్తూ గ్రీన్ కుప్పంగా మార్చి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై బుధవారం మున్సిపల్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, సంఘమిత్రలకు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ కుప్పం- స్వర్ణకుప్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించే విధంగా వారికి అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కుప్పం మున్సిపాలిటీని గ్రీన్ కుప్పంగా మార్చేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నదానిపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి: డీఎస్పీ

ప్రజాశక్తి- పలమనేరు (గంగవరం): విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని డిఎస్పీ ప్రభాకర్ అన్నారు. బుధవారం మదర్ థెరిసా ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబిఏ, ఎంసిఏ, ఎం టెక్, బీటెక్ విద్యార్థులకు నిర్వహించిన ప్రెషర్స్ డే కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు మంచి సౌకర్యాలను అందిస్తోందని తెలిపారు. అలాగే రెండో సంవత్సరం విద్యార్థులు కొత్త వారిని స్నేహపూర్వకంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డిఎం.రవీంద్రబాబు, చైర్మన్ ఎంఆర్.సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, హెచ్ఓడిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి పరీక్షలు వేగవంతం చేయాలి

క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కోటిరెడ్డి

ల్యాబ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మేనేజర్ కోటిరెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాలెం: హెచ్ఐవి పరీక్షలు వేగవంతం చేయాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హెచ్ఐవి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు గుర్తించి వారు ద్వారా హెచ్ఐవి బాధ్యతలకు తగు న్యాయం చేయాలని హెచ్ఐవి సోకిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మందులను సరఫరా చేస్తున్నదని క్రమం తప్పక మందులు వాడి ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఐసిటిసి సూపర్‌వైజర్ సురేంద్రబాబు, ఏఆర్టీ కేంద్ర కౌన్సిలర్ బాబు, లాబ్ టెక్నీషియన్ జయచంద్ర, ఏఎన్ఎం రాజేశ్వరిలక్ష్మి పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలోని పరేడ్ మైదానంలో నవంబరు 14వ తేదీ టీటీడీ నిర్వహించనున్న కార్తీక మహాదీపోత్సవం ఏర్పాట్లను జేఈవో వి. వీరబ్రహ్మం బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించే దీపోత్సవానికి విస్తత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ఎస్వీబీసీ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు వేద స్వస్తితో దీపోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం దీప ప్రశస్తి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విష్ణుసహస్రనామ పారాయణం, మహాలక్ష్మీ పూజ, దీప లక్ష్మి నత్యరూపకం, గోవిందనామాలు, చివరగా కుంభ హారతితో రాత్రి 8.30 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, ఎస్వీబీసీ సీఈవో డి.ఫణికుమార్ నాయుడు, ఎస్ఇ మనోహరం, విజివో గిరిధర్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరులో విద్యార్థులకు ప్లేట్లు, నీళ్ల బాటిల్స్ పంపిణీ

ప్రజాశక్తి - కెవిబిపురం: మండలంలోని కళత్తూరులో వరద ముంపు బాధిత విద్యార్థులకు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ప్లేట్లు, నీళ్ల బాటిళ్లను అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్ నేతృత్వంలో 170 స్టీలు ప్లేట్లు, 170 వాటర్ బాటిళ్లను ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న కళత్తూరు దళితవాడ, కళత్తూరు గ్రామం, పాతపాలెం దళితవాడ పాఠశాలల పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రానికి అందజేశారు. సిపిఎం చేయూతను జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రశంసించారు. నాయకులు పి.గురవయ్య, వేణు, గురునాథం, నాగలాపురం నాగరాజు, జ్ఞానమ్మ, రాం పాల్గొన్నారు.